# 2. తిరునీలకంఠ నాయనారు

చిదంబరంలో నిరంతర శివధ్యాన తత్పరుడైన ఒక మహాభక్తు డుండేవాడు. కుమ్మరి కులంలో జన్మించాడు. అదే వృత్తిని చేబట్టి శివభక్తులను ఎంతో నమ్రతతో సేవిం చేవాడు. మంచి గృహస్తు. గృహస్తు ధర్మాన్ని యధావిధిగా పాటిస్తూ వచ్చిన శివభక్తులకు ఆనందముతో సేవ చేస్తూ తాను తయారుచేసిన బిక్షా (మృణ్మయ) పాత్రలను శివభక్తుల కు ఉచితంగా ఇచ్చేవాడు. శివుని నీలకంఠునిగా భక్తి ప్రపత్తులతో కొలిచేవాడు. ప్రపంచం మనుటకు శివుడు హాలాహలంను మ్రింగిన వైనమును, ఆయనను కొలిచేవారికి రక్షకు డు పాపాల్నిబాపి తనలోకానికి తీసికొని వెళ్తాడని అందఱకు చెబుతూండేవాడు. సదా నీ లకంఠుని నామము ఉచ్ఛరించేవాడుకాన అందఱూ అతనిని నీలకంఠనాయనారు అని పిలిచేవారు.

ఇన్ని మంచి గుణాలున్నా ఒకరోజున కామానికి వశుడై ఒక పడుపు కత్తె ఇంటికి వెళ్లాడు. ఇంటికి రాగానే అతని భార్య ఈ విషయాన్ని పసిగట్టింది. హృదయం వేధిస్తున్నా - దానిని బయటపడనీక - భర్తకు యోగ్యురాలయిన భార్యగా సేవచేస్తూనే - దాంపత్య సమాగమాన్ని మనసులోనే వెలివేసింది. నాయనారుకు ఆమె చర్యలు అర్థము కాలేదు. ఒక రోజున కోరికతో ఆమెను సమీపింపగా - ఆమె నీలకంఠుని పై ఆన పెట్టింది. “ఆయ న పేరుతో మిమ్ములను అడుగుతున్నాను మమ్మల్ని తాకకండి”! . ఆమె మమ్మల్ని అని అం ది కాబట్టి నీలకంఠనాయనారు లోకంలో ఏ స్త్రీని తాకకూడదని నిశ్చయించుకున్నాడు. పరమశివునిపై ఆయనకు అంత అనన్య ప్రేమ. ఈ విధంగా ఒకరినొకరు తాక కుండ జీవించటం మొదలుపెట్టారు. దీన్ని గూర్చి బయట ప్రపంచంలో ఎవరికిని తెలియ నీయ లేదు. సంవత్సరాలు గడిచాయి. భార్యాభర్తలు వృద్ధులు గూడ అయ్యారు.

ఈశ్వరునికి వీరి ఔన్నత్యము లోకానికి చాటాలనిపించింది. అందుకని ఒక శివ యోగిగా రూపుదాల్చి - నీలకంఠనాయనారు ఇంటికి విచ్చేశాడు. నీలకంఠారు సాదరము గా తన వీటిలోనికి ఆహ్వానించాడు. సపర్యలు చేశాడు. యోగి ఒక బిక్షాపాత్రను నీలకం ఠనాయనారునకు ఇచ్చి "నేను మఱలి వచ్చువరకు దీన్ని సురక్షితంగా వుంచండి. నాకు ఇది అత్యంత విలువైనది.దీన్ని తగులటయే తరువాయి అన్ని వస్తువులు పవిత్రమవుతాయి. అందుకని జాగ్రత్తగా కాపాడవలసినది" అంటూ శివయోగి వెళ్లిపోయాడు. నీలకంఠారు దాన్ని జాగ్రత్తగా దాచాడు.

చాలకాలమైన తర్వాత ఒక రోజున శివయోగి తిరిగివచ్చి నీలకంఠారును ఆ భిక్షా పాత్ర గూర్చి అడిగాడు. శివయోగి దాన్ని మాయంచేసి ఆ పాత్రను తెచ్చి ఇమ్మని నీలకంఠా రును అడిగాడు. నీలకంఠార్ అంతా వెదికాడు. ఆ పాత్ర ఎచ్చటను కన్పింపలేదు. అది మా యగావుంది. సిగ్గుపడి పోయాడు. భయంతో వణకుతూ శివయోగి పాదాలపై బడ్డాడు. ఆ పాత్ర ఎచ్చటనూ కన్పింపలేదు అని వాపోయాడు.యోగికి విపరీతంగా కోపం వచ్చింది. నీలకంఠారును -నీవు దొంగవని, మోసకారివని నిందించాడు. నీలకంఠార్ ఆ పాత్ర కన్న విలువైన పాత్ర ఇస్తానన్నాడు. శివయోగి ఒప్పకొనలేదు.

పదే పదే శివయోగికి -"తాను ఆ పాత్ర ను దొంగి లించలేదని, ఏదోమాయగా అది కన్పించటం లేదని, అది ఎట్లా మాయమైందో తనకు అర్థం కావటం లేదని" చెప్పా డు. శివయోగి "నీవు చెప్పేది నిజమైతే నీభార్య చేయిపట్టుకొని ప్రమాణం చేయుమని" అడిగాడు. నీలకంఠునిపైన ఆనపెట్టాడుకాన నీలకంఠారుదానికి అంగీకరించలేదు. "అత ని అనంగీకారం నీలకంఠారు దోషాన్ని చూపుతున్నదని" శివయోగి అన్నాడు. అందుకని దొంగతనం నేరంపై న్యాయస్థానానికి తీసికొని వెళ్లాడు. శివయోగి చెప్పినట్లుగా ప్రమా ణం చేయవలసినదనిగా ఆజ్ఞాపించారు. నీలకంఠారు తను, తన భార్య ఒక కఱ్ఱను ఇద్ద రు చెరి యొక కొనను పట్టుకొని చెఱువులో మునుగబోయారు. యోగి వీరిరువురు చేయిని బట్టికాక కఱ్ఱను పట్టుకొని మునుగుటకు వీలులేదన్నాడు. నిజం నిరూపణ కొఱ కు ఒకరి చేయినొకరు పట్టుకొని నీటమునగాలని ఆదేశించారు. నీలకంఠారు తన ఆన గూర్చి ఇక నిజందాచ లేకపోయాడు. భార్యా భర్తల మధ్య జరిగినది, దేమునిమీద ఆన గూర్చి వెల్లడించి తాను తన భార్య చేయిని తాక జాలనని విన్నవించాడు. ఇలా చెప్పి ఇద్ద రు కఱ్ఱను చెరి ఒక కొనను పట్టుకొని నీటమునిగారు. ఒక విచిత్రం జర్గింది. ఇద్దరూ

నీటమునిగి బయటకు లేవగానే - వారిద్దరు రూపసులైన యవ్వన వంతులుగా మారి పోతారు. శివయోగి అంతర్థాన మయ్యాడు. పార్వతీపరమేశ్వరులు అచట సాక్షాత్కరించారు. “మీరు అత్యంత సంయమనముతో, భక్తితో జీవనం జరిపిన పుణ్య విశేషంచే మీరిద్దరు నిరంతరం యవ్వన వంతులుగా నాలోకంలో శాశ్వతంగా నివసించండి” అని వారిని తమ లోకానికి తీసికొని పోయారు. శివభక్తి తత్పరత, సంయమము, నిర్మల జీవనము ఎలా, పరమశివుని యొక్క శాశ్వత స్థానానికి చేర్చగలవో పరమశివుడు లోకానికి వెల్లడించాడు. పరమశివునిపై అనన్య భక్తి నీలకంఠారును చెడుపనులనుండి చెడుతలపులనుండి వైముఖ్యత కల్గించి సచ్చరిత్రులుగా వారిని నిలబెట్టి అంత్యమున వారికి శివ సాయుజ్యము కలుగుటకు కారణభూతమైంది.

****